కలెక్షన్.. ఎలక్షన్.. ప్రజాపాలన టెన్షన్

- ఆస్తిపన్ను లక్ష్యాలు చేరుకునేందుకు ప్రణాళికలు
- కుత్బుల్లాపూర్ లక్ష్యం రూ. 57.38 కోట్లు
- గాజులరామారం లక్ష్యం రూ.34.97 కోట్లు

కుత్బుల్లాపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క ఆస్తి పన్ను కలెక్షన్.. మరోపక్క ఎలక్షన్ విధులు.. మధ్యలో ప్రజాపాలన (అభయహస్తం) విధులతో పని ఒత్తిడి కారణంగా జీహెచ్ఎంసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలు, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల విధులతో పీకల్లోతు ఆర్థిక ఊబిలో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతున్న జీహెచ్ఎంసీ ఆదాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అంతంత మాత్రంగా సాగిన ఆస్తిపన్ను వసూళ్లు.. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలతో పాటు ప్రజాపాలన విధులు, సంక్రాంతి పండుగ నేపథ్యంలో వసూళ్ల మరింత కుదేలయింది. ఈ నేపథ్యంలో పన్ను వసూళ్లలో ఉన్నతాధికారులు కేటాయించిన లక్ష్యాలను చేరుకొనేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. దీని కోసం బుధవారం నుంచి అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి రోజువారీ లక్ష్యాలతో ముందుకు సాగేందుకు శ్రీకారం చుట్టారు.

● ఎన్నికల విధుల్లో రెవెన్యూ యంత్రాంగం

అసెంబ్లీ ఎన్నికల్లో రెవెన్యూ అధికారులకు పూర్తి స్థాయిలో విధులు కేటాయించడంతో ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి కేంద్రీకరించలేకపోయారు. ఎన్నికల అనంతరం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం ప్రవేశపెట్టిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ, అనంతరం వాటి కంప్యూటరీకరణ పనుల్లో తలమునకలయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు సవరణలో భాగంగా సర్వేలను కూడా వీరే నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా పరిశీలన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, కావల్సిన సదుపాయాల ఏర్పాట్లు, స్లిప్పుల పంపిణీతో పాటు ఇతరత్రా విధుల్లో రెవెన్యూ యంత్రాంగం కీలకంగా వ్యవహరించింది. దీని ప్రభావం ఆస్తిపన్ను వసూళ్లపై పడింది. ప్రస్తుతం ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి కేంద్రీకరించి లక్ష్యాలను చేరుకునేందుకు సిద్ధమైంది. కానీ లోక్‌సభ ఎన్నికల రూపంలో విధులను కేటాయించి అటు కలెక్షన్.. ఇటు ఎలక్షన్ విధులకు ఎటువంటి భంగం కలగకుండా విధులు నిర్వహించాలనే ఆదేశాలు ఉన్నతాధికారుల జారీ చేసినట్లు ఓ అధికారి తెలిపారు. సరిపడా సిబ్బంది లేక సతమతమవుతున్న రెవెన్యూ విభాగంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఎన్నికల అదనపు విధులు వచ్చి పడుతున్నాయి. దీంతో ఎటూ పాలు పోని స్థితిలో అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు.

తలలు పట్టుకుంటున్న అధికారులు



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం

● జంట సర్కిళ్లలో వసూళ్లు

కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.57.38 కోట్ల ఆస్తిపన్ను వసూళ్ల చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాలు నిర్దేశించారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని 9 డాకెట్లకు మొత్తం 62,924 అస్సులుండగా వాటిలో నివాస ఆస్తులు (రెసిడెన్షియల్) 54,815 కాగా, వ్యాపార ఆస్తులు (నాన్ రెసిడెన్షియల్) 7,123, మిశ్రమ ఆస్తులు (మిక్స్‌డ్) 1,186 ఉన్నాయి. వీటిలో బుధవారం నాటికి 29,465 నివాస ఆస్తుల నుంచి రూ.16.82 కోట్లు, 4,024 వ్యాపార ఆస్తుల నుంచి 16.85 కోట్లు, 626 మిశ్రమ ఆస్తుల నుంచి 1.60 కోట్ల రూపాయలతో మొత్తం రూ.35.27 కోట్లు వసూళ్ల చేశారు. ఇంకా రూ.22.11 కోట్ల ఆస్తిపన్నును వసూలు చేయాల్సి ఉంది.

● గాజులరామారం సర్కిల్‌కు రూ.34.97 కోట్ల ఆస్తిపన్ను వసూళ్ల చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ మేరకు గాజులరామారం సర్కిల్ పరిధిలోని 7 డాకెట్లకు గాను బుధవారం నాటికి నివాస ఆస్తుల నుంచి రూ.8.94 కోట్లు, వ్యాపార ఆస్తుల నుంచి 10.72 కోట్లు, మిశ్రమ ఆస్తుల నుంచి 1.48 కోట్లతో మొత్తం రూ.21.14 కోట్లు వసూలు చేశారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ఇంకా రూ.13.83 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉంది.

పకడ్బందీ చర్యలతో ముందుకు..



ఆస్తిపన్ను వసూళ్లకు ప్రణాళికలు రూపొందించి రోజువారీ లక్ష్యాలతో పకడ్బందీ చర్యలతో ముందుకు సాగుతున్నాం. పన్ను వసూళ్ల వేగవంతం చేసేందుకు సిబ్బందితో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశాం. వినియోగదారులు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆస్తిపన్ను చెల్లించి అధికారులకు సహకరించాలి.

- ఎల్పి మల్లయ్య, గాజులరామారం ఉపకమిషనర్

లక్ష్యాలను చేరుకునే దిశగా చర్యలు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఉన్నతాధికారులు ఆస్తిపన్నులో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే దిశగా చర్యలు చేపడుతున్నాం. మొండి బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసి పన్ను వసూలు వేగవంతం చేస్తున్నాం. వినియోగదారులు కూడా పన్నులను సకాలంలో చెల్లించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

- వి.నర్సింహ, కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్

21న ప్రకృతి విజ్ఞాన చికిత్సపై జాతీయ సదస్సు

పంజాగుట్ట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ యోగ విద్యాలయం, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని రామచంద్ర ప్రకృతి ఆశ్రమంలో ఈ నెల 21న ప్రకృతి విజ్ఞాన చికిత్సపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సులో వంద రకాల దేశవాళీ బియ్యం, వందరకాల కూరగాయల దేశవాళి విత్తనాలు, మట్టి కుండల తయారీ, సహజ రంగులు, ఖాదీ, చేనేత, తాటి ఆకుల బొమ్మలు, ఔషధ మొక్కలు, గానుగ నూనె, సిరి ధాన్యాలు, ఇతర ప్రదర్శనలు, అమ్మకాలు చేస్తామన్నారు.


జడ్‌సీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

పెండింగ్ పనులపై ఎమ్మెల్యే సమీక్ష

గచ్చిబౌలి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని కూడా పూర్తిచేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ జోనల్ కమిషనర్ స్నేహషబరీష్‌కు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో జోనల్ కమిషనర్‌ను కలిశారు. నిధులు సరిగ్గా విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని, నిధులు సక్రమంగా విడుదలయ్యేలా చూడాలని కోరారు. చెరువుల సుందరీకరణ కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, హమీద్‌పటేల్, మంజులరెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో పాటు పలువురు పాల్గొన్నారు.

● జెడ్సీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్‌ను బుధవారం వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాపిపాక యాదగిరి కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. నాగమణి, వెంకటేష్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు శివాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం

కూకట్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ పరిధి కేపీహెచ్‌బీకాలనీ మూడో రోడ్డులోని శివాలయంలో గురువారం స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ మాధవరం కాంతారావు తెలిపారు. ఈనెల 22న అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని ఆలయ ప్రాంగణాల్లో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాలన్న ప్రధాని పిలుపు మేరకు శివాలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు పాల్గొంటారని కాంతారావు పేర్కొన్నారు.


ప్లకార్డులతో నియమాలు వివరిస్తున్న టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

రోడ్డు నిబంధనలు పాటించాలి

బాలానగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు ప్రమాదాల బారిన పడకుండా రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు వాహనదారులకు సూచించారు. బుధవారం బోయినపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వాహనదారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనలు, భద్రతా చర్యలు వాహనదారులకు వివరించినట్టు తెలిపారు. ఈ సదస్సులో స్టార్ బజార్ రీజియనల్ మేనేజర్ పి.వంశీకృష్ణ, స్టోర్ మేనేజర్ సంపత్, స్టోర్ సిబ్బంది ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.


మహిళలకు చీరలు పంచుతున్న నాగిరెడ్డి

పోచమ్మ మైదానంలో చీరలు పంపిణీ

ఫతేనగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా డ్వాక్రా మహిళలు చేస్తున్న సేవలు అభినందనీయమని ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌కాలనీ పోచమ్మ ఆలయ మైదానంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి 25 మంది డ్వాక్రా, పారిశుధ్య, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కాలనీవాసులు శారద, అశోక్, బుచ్చిబాబు, సంతోష్, పప్పు, దామోదర్ పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన శ్రీనివాస్

పేట్‌బషీరాబాద్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ వ్యక్తి భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జగద్గిరి గుట్ట సీఐ కాంత్రికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. జగద్గిరిగుట్టకు చెందిన పల్లపు శ్రీనివాస్ (45) కుటుంబసభ్యులతో కలిసి గాజుల రామారం కైలాస్‌హిల్స్‌లోని మణిధీర్ రెసిడెన్సీలో వాచ్‌మన్‌గా పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. పార్కు చేసిన వాహనాల్లో పెట్రోల్ మాయమవుతుందని అపార్టుమెంట్ వాసి లక్ష్మి శ్రీనివాస్‌ను అడిగి, ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని చెప్పడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో బయటక వెళ్లిన శ్రీనివాస్ తిరిగి ఇంటికి వచ్చాడు. భార్య భర్తల మధ్య మళ్లీ గొడవ జరిగింది. దీంతో భార్య యామిని నిదురపోయాక శ్రీనివాస్ రాత్రి 5వ అంతస్తు భవనంపైకి ఎక్కి దూకడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన మహిళ ఆచూకీ లభ్యం

పేట్‌బషీరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): ఆటో నుంచి పడి మృతి చెందిన మహిళ ఆచూకీ లభించిందని జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపారు. సిద్దిపేట జిల్లా, అక్కన్నపేట మండలం, మల్లంపల్లి గ్రామానికి చెందిన ఎం.ఎల్లమ్మ(55) భర్తతో కలిసి ఎల్‌బీనగర్‌లో ఉంటున్న అయ్యప్పమాల వేసుకున్న కుమారుడు వద్దకు మంగళవారం వచ్చింది. పూజ అయ్యాక భర్త సొంత ఊరికి వెళ్లగా, ఎల్లమ్మ ఆల్విన్‌కాలనీలో ఉంటున్న కుమార్తె లలిత వద్దకు వెళ్లేందుకు ఉప్పల్ నుంచి బస్సులో జగద్గిరిగుట్టకు వచ్చింది. జగద్గిరిగుట్ట వద్ద టీఎస్ 7 యూఏ 7546 నెంబరు ఆటోలో ఎక్కి ఆల్విన్‌కాలనీకి వెళ్తుండగా మార్గమధ్యలో హరిణిప్రియ బార్ వద్ద ఆటో డ్రైవర్ అతి వేగము, అజాగ్రత్తగా నడపడంతో మహిళ ఆటో నుంచి జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో కుమార్తె లలిత ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వై జంక్షన్ వద్ద మహిళ మృతదేహం



కూకట్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధి వై జంక్షన్ సమీపంలో అనుమానస్పదస్థితిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించింది. కూకట్‌పల్లి జాతీయ రహదారి పిల్లర్ నెంబర్ 868 వద్ద మంగళవారం రాత్రి మహిళ మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృ తురాలి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటాయని, ఆమె వివరాలు తెలియలేదని, కూకట్‌పల్లి వై జంక్షన్ సమీపంలోని భిక్షాటన చేస్తూ ఉంటుందని, సంబంధీకులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గ్రిల్ హౌస్ హోటల్ సీజ్

- లైసెన్స్ రద్దు ● 17 మంది బాధితుల్లో ఆరుగురు డిశ్చార్జి
- మరో 11 మంది బొల్లారం కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స


కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అల్వాల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ లోతుకుంటలోని గ్రిల్‌హౌస్ హోటల్ ఘటనలో సంబంధిత హోటల్ లైసెన్స్‌ను జీహెచ్ఎంసీ అధికారలు బుధవారం రద్దు చేయడంతో పాటు సీజ్ చేశారు. హోటల్ యజమానిపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 13న గ్రిల్ హౌస్‌లో కొంతమంది షవర్మా తిన్నారు. వారిలో మొదట నలుగురు అస్వస్థకు గురికాగా తాజాగా మరో 13 మందికి విరేచనాలు, వాంతులు అయ్యాయి. వారంతా బొల్లారం కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. మరికొంత మందిని సుచిత్రలోని మరో ప్రైవేట్ ఆస్పత్రిలో తరలించగా వారిలో కోలుకున్న ఇద్దరిని డిశ్చార్జి చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఆరుగురిని డిశ్చార్జి చేయగా మరో 11 మంది బొల్లారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రక్త పరీక్షల్లో సాల్మొనెల్లా బ్యాక్టీరియా

బాధితులు అస్వస్థతకు గురి కావడానికి కారణాలు తెలుసుకోవడానికి రక్త పరీక్షలు నిర్వహించడంతో సాల్మొనెల్లా బ్యాక్టీరియా ఉన్నట్లు తేలిందని జీహెచ్ఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. గుడ్డులోని పచ్చసొన, నిమ్మరసం, నూనెను మిక్సీలోవేసి మయోనైస్‌ను తయారు చేస్తారు. వాటిని శుభ్రం చేయకుండానే మిక్సీలో వేస్తారు. కొన్నిసార్లు గుడ్డు షెల్ కూడా అందులో పడుతుంది. పరిశుభ్రత పాటించకపోవడం కారణంగా అలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు.

మయోనైస్‌ను నిల్వ చేస్తే అంతే..!

గుడ్డుకు బదులు సోయాబీన్స్‌తో కూడా మయోనైస్‌ను తయారు చేసుకోవచ్చని హోటళ్ల యజమానులకు వివరించామన్నారు. వెజ్ మయోనైస్‌తో పోల్చుకుంటే గుడ్డుతో తయా రు చేసిన మయోనైస్ రుచి ఉండటంతో షవర్మా, పిజ్జాలు, ఎగ్‌బర్గర్, వెజ్‌బర్గర్ తదితర వాటిలో వీటిని ఉపయోగిస్తారని లక్ష్మీకాంత్ వివరించారు. మయోనైస్ వెంటనే ఉపయోగించాలని, నిలువ ఉంచితే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. గ్రిల్‌హౌజ్ యజమాని తౌఫిక్‌పై ఐపీసీ 273, 269 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అల్వాల్ స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ రాహుల్‌దేవ్ తెలిపారు.



అయోధ్య నుంచి విచ్చన అక్షింతలను ఓల్డ్‌బోయినపల్లి డివిజన్ హస్మత్‌పేట అంజయ్యనగర్‌లో బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజయ్యనగర్ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ ముదిరాజ్, సంతోష్‌కుమార్, సుజాత, ఈశ్వరి, శ్రీకన్య, అనిత పాల్గొన్నారు.

- ఓల్డ్‌బోయినపల్లి, ఆంధ్రజ్యోతి

మైనారిటీ గురుకులాల దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పరిధిలోని తొమ్మిది మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె.నవీన్ కుమార్ రెడ్డి సూచించారు. జిల్లాలోని హయత్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలాపూర్(బాలురు), ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, హయత్‌నగర్, ఫరూఖ్‌నగర్, మొయినాబాద్(బాలికల) మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లు, 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, 6,7,8వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీలను(మైనారిటీలకు మాత్రమే) భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీరాంనగర్, శంకర్‌నగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీరాంనగర్, ఆర్ఎస్ బ్రదర్స్, వీఆర్‌కె సిల్క్స్, అన్నపూర్ణఎన్‌క్లేవ్, హరిజనబస్తీ, బీహెచ్ఈఎల్ మెయిన్‌రోడ్డు, చందానగర్ పోలీస్‌స్టేషన్, గౌతమినగర్, ఓల్డ్‌ముంబాయ్‌రోడ్డులో విద్యుత్ ఉండదన్నారు.

● దీప్తిశ్రీనగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మియాపూర్ పోలీస్‌స్టేషన్, పార్వ్యూన్‌హైట్స్, మదీనగూడ మెయిన్‌రోడ్, సాయినగర్‌కాలనీ, కృష్ణదేవరాయకాలనీలో విద్యుత్ ఉండదని తెలిపారు.

● **రాయదుర్గం :** రైల్వేవిహార్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయిబాబా టెంపుల్ ప్రాంతం, సిటిజన్‌కాలనీ, శివాజీనగర్, భారత్ పెట్రోల్‌బంక్ వెనుక ప్రాంతం, గౌలిదొడ్డి, హుడా ట్రేడ్‌సెంటర్, వెంకటరెడ్డికాలనీ, రైల్వే విహార్‌కాలనీ, ఓల్డ్‌లింగంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. అదే విధంగా వెజిటెబుల్‌మార్కెట్, ఇంజనీరింగ్ ఎన్‌క్లేవ్, తారానగర్, శాంతినగర్, హుడాకాలనీ, చందానగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి 2 గంటల వరకు లింగంపల్లి మటన్‌మార్కెట్, పోలీస్‌క్వార్టర్స్, వెజిటెబుల్‌మార్కెట్, ఎస్ఎం లేఔట్, ఓల్డ్‌పోలీస్‌స్టేషన్ రోడ్డు, గంగారం గ్రామం, వెంకటాద్రినగర్, లింగంపల్లి, పోచమ్మ ఆలయం, పీజేఆర్ స్టేడియం, శివాజీనగర్, తారానగర్ గ్రామం, రామాచారి స్కూల్, తారానగర్ మసీద్, వెంకట్‌రెడ్డికాలనీ, తెల్కర్ అపార్ట్‌మెంట్స్, శాంతినగర్, కడిమిహాస్పటల్, వెంకటాద్రినగర్, జీహెచ్ఎంసీ మీ-సేవ, వింద్యానర్సింగ్‌హోం ప్రాంతం, చందానగర్, హుడాకాలనీ, వెంకటేశ్వరస్వామి ఆలయం, గీతా థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

గోమాత సంరక్షణకు కృషి చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్‌రావు


గోశాలను ప్రారంభిస్తున్న రాజేశ్వర్‌రావు

ఫతేనగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటున్నానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం ఫతేనగర్ డివిజన్ దీనదయాల్‌నగర్ పంచముఖ హనుమాన్ దేవాలయ వద్ద ఏర్పాటు చేసిన గోశాలను స్థానిక నేతలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దీనదయాల్‌నగర్ బస్తీ వాసుల కోరిక మేరకు తన తండ్రి వడ్డెపల్లి నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం సొంత నిధులు ఖర్చు చేసి గోశాల షెడ్డును నిర్మించి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రారంభించడం తనకెంతో సంతృప్తి నిచ్చిందన్నారు. గోమాతకు సేవచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, అందరూ గోమాత సంరక్షణకు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచి మహేందర్, ఉదయ్‌కుమార్, రామ్మోహన్, సతీష్, అరవింద్ బస్తీ నాయకులు సాయిలు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కుమార్‌గౌడ్, అశోక్‌కుమార్, భవానీ, నగేశ్, విజయ్ భాస్కర్ రెడ్డి, మల్లేశ్‌యాదవ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నిథమ్ డైరెక్టర్‌ను తొలగించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

రాయదుర్గం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నిథమ్ డైరెక్టర్ చిన్నంరెడ్డిని తొలగించి నిథమ్‌ను కాపాడాలని ఉద్యోగులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పలువురు ఉద్యోగులు, సిబ్బంది మాట్లాడుతూ.. చిన్నంరెడ్డిని వెంటనే తొలగించి నిథమ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. అధికారులు స్పందించి చిన్నంరెడ్డిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యం


జమీరాబేగం

బాలానగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లి యువతి అదృశ్యం అయింది. బాలానగర్ గౌతమీనగర్‌లో నివాసముండే సయ్యద్ జఫార్ (లేట్) కుమార్తె జమీరాబేగం అలియాస్ సానియా(19) ఇంటి వద్దనే ఉంటూ అనారోగ్యంగా ఉన్న తన తల్లి బాగోగులు చూసుకుంటోంది. ఈనెల 15న ఉదయం 11 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని తన సోదరుడికి చెప్పి ఇంట్లోంచి వెళ్లింది. ఇంత వరకూ తిరిగి రాలేదు. రెండు రోజులైన ఆమె తిరిగి రాకపోవడంతో సమీప బంధువులు, స్నేహితుల వద్ద ఆమె కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రాత్రి ఆమె సోదరుడు సయ్యద్‌మజాహర్ హుస్సేన్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్


తైక్వాండో విజేతలు

గచ్చిబౌలి,జనవరి17 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్ లీగ్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ క్రీడలను ప్రోత్సహించేలా భారతదేశమంతా 12 జట్లకు చెందిన 96 మంది పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ క్రీడల్లో పంజాబ్ కామ్రెడ్స్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ దక్కించుకుందని నిర్వాహకులు ప్రకటించారు. ఈ పోటీలకు కోచ్‌గా జగజిత్‌సింగ్ మాడ్ నేతృత్వం వహించారు. ఈ పోటీల రెండో సీజన్ దుబాయ్‌లో జరగనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణచాముండేశ్వరి మహర్షి, డాక్టర్ అబ్దులా, తైక్వాండో చైర్మన్ కవిత పాల్గొని విజేతలను అభినందించారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు


కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు



రాయదుర్గం, జనవరి17 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో గాంధీ శిల్పబజార్ నేషనల్, సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా ముగిసాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన చేనేత హస్తకళాకారులు ఉత్పత్తులను అమ్ముకున్నారు. చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అంజు అరవింద్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన, వరంగల్ నుంచి విచ్చేసిన నాట్య గురువులు తాడూరి రేణుక శిష్యబృందం కూచిపూడి, జానపద నృత్యాలు ఎంతగానో అలరించాయి.